క్లుప్తంగా

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో పారా మెడికల్ కోర్సులకు మూడవ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండవ ఫేజ్‌లో కౌన్సెలింగ్‌లు పూర్తి కాగా మిగిలిన ఆరు సీట్లకు మూడవ ఫేజ్ కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఇందుకోసం నూతనంగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్‌మీడియెట్ బైపీసీ విద్యార్హత కలిగిన ఆయా రోస్టర్ కేటగిరికి చెందిన విద్యార్థులు మాత్రమే రూ.100లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు నవంబర్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలని, దరఖాస్తు చేసుకున్న వారికి 8వ తేది ఉదయం 10 గంటలకే కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. డి.డార్క్ రూమ్ అసిస్టెంట్ కోర్సులో బీసీ(డీ)కు ఒక సీటు, బీసీ(ఎ)కు ఒక సీటు, డీఎంఐటీ కోర్సులో ఎస్టీకి ఒక సీటు, డి.అనెస్తీషియా కోర్సులో బీసీ-సీకి ఒక సీటు, బీసీ(డీ)కి ఒక సీటు, డీఎంఎల్‌టీ కోర్సులో బీసీ-సీకి ఒక సీటు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వివరాలకు www. appmb.co.in లేదా appshpc.co.inను సంప్రదించాలన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల నియామకం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని పలు స్థానాలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను నియమించారు. హంద్రీ - నీవా సుజల స్రవంతి యూనిట్-4 భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా టి.అజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఇతను గుంటూరులోని విజిలెన్స్, సివిల్ సప్లై విభాగంలో పనిచేస్తుండగా కర్నూలుకు బదిలీచేశారు. అలాగే పీఏ టూ శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా పి.కొండయ్యను నియమించారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన

కర్నూలు సిటీ: నగర శివారులోని ఎస్ఆర్ కాలేజీ వార్షికోత్సవం, ఫ్రెషర్స్ కమ్ ఫెయిర్‌వెల్ వేడుకలు బుధవారం ఆ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురువయ్య శెట్టి, తాలుకా సీఐ శ్రీధర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ కీలకమని, ఇక్కడే భవిష్యత్తు దశను నిర్ణయిస్తుందన్నారు. ఇష్టపడి చదివితే ఫలితాలు గొప్పగా ఉంటాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాలేజీ జోనల్ ఇన్‌చార్జ్ టి.రఘువీర్, అకడమిక్ డీన్ డి.కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎ.రాజు, ఏజీఎం సలీం అలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రేరణ అవగాహన సదస్సు

కర్నూలు సిటీ: కేవీఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం క్లినికల్ హిప్నోథెరపిస్టు డాక్టర్ శిరిగిరెడ్డి జయారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా ప్రేరణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా ప్రేరణ వల్ల సమస్యలను అధిగమించి విద్యతో పాటు జీవితంలో సక్సెస్ సాధించవచ్చన్నారు. ప్రతి అంశంపై స్పష్టమైన అవగహన కలిగి ఉండాలని, తెలియని విషయం గురించి టీచర్స్‌ను అడిగి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. స్కూల్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుల సమస్యలు పరిష్కరించాలని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యదర్శి సి.బంగారి కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను బుధవారం సంఘం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, అసోసియేషన్ సభ్యులు శాంతిలత, ఎస్. సోమేశ్వరి, హెడ్‌నర్సులు పాల్గొన్నారు.





ఎస్టీబీసీ కళాశాల మైదానంలోని స్టాళ్ల వద్ద బాణాసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలు



స్టాళ్లలో విక్రయానికి ఉంచిన బాణాసంచా

హరిత బాణాసంచాతో పండుగ చేద్దాం

- నేడే దీపాల పండుగ దీపావళి
- పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచిస్తున్న ఎన్‌జీటీ
- కర్నూలులో క్రాకర్స్ అసోసియేషన్ ద్వారా అందుబాటులో బాణాసంచా



బాణాసంచాను మోసుకెళ్తున్న వ్యక్తి



విక్రయానికి ఉంచిన ప్రమిదలు, అలంకరణ సామగ్రి



బాణాసంచాను తీసుకెళ్తున్న చిన్నారులు

కర్నూలు(సెంట్రల్): జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు దీపావళి రోజున గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే కాల్చేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లలో గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే అమ్మేలా వ్యాపారులకు నిర్దేశం చేశారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీ, జిల్లా అగ్నిమాపక అధికారి, ఆర్‌డీఓలు, కాలుష్య నియంత్రణ మండలి, మునిసిపల్ అధికారులు బాణాసంచా వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం రూపొందించిన నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

గ్రీన్ క్రాకర్స్ అంటే..

బాణాసంచా పేలుళ్లతో దుమ్మూధూళి (డస్టు), సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ విడుదలై వాతావరణాన్ని కలుషితం చేస్తాయి. అంతేగాక 100 డెసిబుళ్లకుపైగా శబ్దం ఉత్పత్తి అవుతుంది. ఈ క్రమంలో కేవలం 30 శాతం మాత్రమే దుమ్ముధూళి, సల్ఫర్, నైట్రోజన్ డయాక్సైడ్‌లను విడుదల చేసే క్రాకర్లను గ్రీన్ క్రాకర్లు అంటారు. ప్రస్తుతం వీటిని మాత్రమే విక్రయ స్టాళ్లలో ఉంచాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కువ దుమ్మూధూళి (డస్టు), సల్ఫర్‌డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, శబ్ధాలను విడుదల చేసే బాణాసంచాను పేల్చరాదని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు బాణాసంచాను కూడా పండుగ రోజున రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య పేల్చాలని ప్రజలకు సూచిస్తున్నారు.

85 ఏళ్లుగా ప్రభుత్వ పర్యవేక్షణలో...

దీపావళి పండుగ రోజున నరకాశురుని వధ సందర్భంగా బాణాసంచాను పేల్చి సంబరాలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో కుటుంబ సభ్యులందరూ ఒకచోట చేరి బాణాసంచా పేల్చడం పారిపాటింది. ఈ క్రమంలో ప్రజలకు అవసరమైన బాణాసంచాను అందుబాటులో ఉంచేందుకు 85 ఏళ్ల నుంచి ప్రభుత్వ పర్యవేక్షణలో క్రాకర్స్ మర్చెంట్ అసోసియేషన్ స్టాళ్లను ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా కర్నూలు, పత్తికొండ, ఆదోనిలో ప్రజలకు అనువైన చోట స్టాళ్లను ఏర్పాటు చేసి బాణాసంచాను పరిమితమైన రేట్లకు అందుబాటులో ఉంచుతున్నారు. ఈ క్రమంలో ఈ యేడాది కర్నూలులో 106, ఆదోనిలో 9, పత్తికొండలో 4 బాణాసంచా స్టాళ్లను ఏర్పాటుచేశారు. గతేడాదితో పోల్చుకుంటే ఆయా పట్టణాల్లో స్టాళ్ల సంఖ్య పెరిగాయి.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ఎన్‌జీటీ ఆదేశాలను ప్రతిఒక్కరూ పాటించాలి. గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే వాడాలి. ప్రస్తుతం కర్నూలులో మోతాదుకు మించి వాయువులు గాలిలో కలసి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. దీపావళి పండుగ అంటే దీపాలు వెలిగించి సంతోషంగా జరుపుకునే పండుగ. బాణాసంచాను పేల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుంది. పెద్ద శబ్దాలతో కూడిన క్రాకర్స్‌ను పేల్చడం ద్వారా గుండె, ఊపిరితిత్తులతో బాధపడే వారికి ప్రాణాపాయం జరగవచ్చు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

– పీవీ కిశోర్‌రెడ్డి, పర్యావరణ ఇంజినీరు, కర్నూలు

శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు చెప్పారు. ఆయన బుధవారం స్థానిక పందిపాడు, గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని బీఆర్ రెడ్డి నగర్, వీపీఎస్ ఫంక్షన్ హాలు రోడ్డు, సాయినాథ్ నగర్ కాలనీలలో కమిషనర్ పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పలు కాలనీల్లో తక్షణమే మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలి

- వ్యాపారుల సిండికేట్‌ను అరికట్టాలి
- సుందరయ్య సర్కిల్‌లో ఏపీ రైతు సంఘం రాస్తారోకో



సుందరయ్య సర్కిల్‌లో రాస్తారోకో చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఉల్లికి న్యాయమైన గిట్టుబాటు ధర ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మార్కెట్‌లో వ్యాపారుల సిండికేట్‌ను అరికట్టాలని కోరారు. బుధవారం సుందరయ్య సర్కిల్‌లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉల్లి రైతుల కోసం పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. రైతులకు కనీసం పెట్టుబడి ఖర్చు కూడా రావడం లేదన్నారు. మరోవైపు మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని కొనుగోలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నాయకులు ఎం.రాజశేఖర్, టి.రాముడు, గురుశేఖర్, అబ్దుల్లా, రంగప్ప, వెంకటేశ్వర్లు, హుస్సేన్‌బాషా, సుధాకర్ పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులు వెంటనే చేపట్టండి

- కలెక్టర్‌పి.రంజిత్‌బాషా



కర్నూలు(సెంట్రల్): జిల్లాలో 412 కిలో మీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్లపై పడిన గుంతలను పూడ్చే పనులను రెండు, మూడు రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరమ్మతుల కోసం రూ.11.16 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులతో గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో వెంటనే పనులను ప్రాంభించాలన్నారు. 15 రోజుల తరువాత పనుల వారీగా సమీక్షిస్తానని, అప్పుడు కారణాలు చెప్పేకంటే చేయడమే మేలన్నారు. కాగా, వర్షాలతో 260.57 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల కోసం రూ.5.22 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. మండల కేంద్రాల నుంచి గ్రామాలకు వెళ్లే 14 రోడ్ల నిర్మాణానికి ఎన్ఆర్‌జీఈఎస్ కింద ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, ఈఈసురేష్‌బాబు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ తనిఖీలు

- 3 షాపులపై కేసులు
- రూ. 41 వేలు జరిమానా

కర్నూలు (టౌన్): కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో లీగల్ మెట్రాలజీ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్ ప్రాంగణంలోనే కాకుండా చుట్టుపక్కల ఉన్న కూల్ డ్రింక్స్ షాపులు, స్వీట్ షాపులను తనిఖీ చేశారు. తనిఖీల్లో కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్‌ను అధిక ధరకు విక్రయిస్తున్న మూడు షాపులపై కేసులు నమోదు చేశారు. వస్తువుల మీద ప్యాకేజీ తేదీలు, నిలువ సమయం తెలియజేసే తేదీలు లేకపోవడంతో రూ. 41 వేలు జరిమానా విధించారు. వస్తువులను అధిక ధరలకు అమ్మినా, తూకం తక్కువగా ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ సీహెచ్ దయాకర్ రెడ్డి హెచ్చరించారు.

బోధనేతర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం బోధనేతర ఉద్యోగుల సమస్యలు పరిష్కంచాలని వర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మీనాక్షిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్‌యాదవ్, సలహాదారుడు రంగనాథ్, సభ్యులు రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు. వర్సిటీ ఏడీ బిల్డింగ్‌లో ఒకటే సెక్షన్‌లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను కీలకమైన సెక్షన్‌ల నుంచి బదిలీ చేయాలని రిజిస్ట్రార్ దృష్టికి తెచ్చారు.

దాడిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరం 24వ వార్డు లక్ష్మీనగర్‌లోని రమణమ్మ రెసిడెన్సీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న శశికళపై మద్యం మత్తులో దాడి చేసిన విశ్వనాథ రెడ్డిని అరెస్టు చేయాలని అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ల సంఘం నగర అధ్యక్షుడు సి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. విశ్వనాథరెడ్డి ఆమెను ప్రతి రోజూ దూషిస్తూ ఉండేవారని, బుధవారం ఏకంగా తప్పతాగి వచ్చి దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడిని అడ్డుకోబోయిన శ్రీదేవి, సరస్వతిబాయిపై కూడా దాడికి పాల్పడి గొంతు నులిమి చంపుతానని బెదిరించడం అన్యాయమన్నారు. వెంటనే అతన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

2న ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక కంట్రోల్ రూమ్ సమీపంలోని స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో నవంబర్ 2న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు స్థానిక కిసాన్ ఘాట్ వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్, వాటర్ పోలో క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఆసుపత్రి అభివృద్ధికి కార్యాచరణ

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రి అభివృద్ధికి త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తానని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. ఆసుపత్రిలో నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వెంకటేశ్వర్లును పలువురు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, నగర ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చాలా మంది పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వాటికి త్వరలో కార్యాచరణ రూపొందించి వీలైనంతలో పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. కేఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్, డాక్టర్ విజయానందబాబు, రేడియాలజి విభాగాధిపతి డాక్టర్ రాధారాణి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీబాయి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ పుస్తకాలను పంపిణీ చేస్తున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రజారోగ్యం లక్ష్యంగా రసాయనాలు లేని పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సూచించారు. బుధవారం స్థానిక మద్దూరునగర్‌లోని ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎలాంటి రసాయనాలు లేకుండా ఆహార పంటలు, కూరగాయలు, ఆకు కూరలు పండించి ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పెద్ద ఎత్తున రైతుల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. న్యాచురల్ ఫార్మింగ్ సార్వత్రిక సూత్రాలు, సప్త సూత్రాలు, ఏగ్రేడ్, ఏటీఎం, కషాయాల తయారీ విధానాలు తదితర వాటితో బుక్‌లెట్ తయారు చేశామని, దీన్ని రైతులకు అందచేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. డీపీఎం చంద్రశేఖర్, ఎన్ఎల్‌పీఎం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డిప్తీరియా వ్యాధిని నివారించాలి



పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎంఓ డాక్టర్ ఉమ

కర్నూలు(హాస్పిటల్): పిల్లలకు డిప్తీరియా (కంఠసర్పి) వ్యాధి సోకకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఎంఓ డాక్టర్ ఉమ సూచించారు. ఆమె బుధవారం స్థానిక రోజా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 124వ సచివాలయంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డిప్తీరియా వ్యాధి పిల్లలకు ఎక్కువగా సోకుతుందన్నారు. ఈ వ్యాధి భారిన పడిన వ్యక్తి దగ్గినప్పుడు గాలి ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందని తెలిపారు. తీవ్రమైన జ్వరం, గొంతునొప్పి, గొంతులో తెల్లని పొర ఏర్పడి శ్వాస తీసుకోవడం కష్టమవుతుందని చెప్పారు. శిశువులు పాలు తాగలేరని, పిల్లలు ఆహారం తీసుకోలేరన్నారు. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. జాతీయ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం కింద 5 రకాల వ్యాక్సిన్లు కలిగిన పెంటావ్యాక్సిన్ పిల్లలకు ఆరు వారాలు, 10 వారాలు, 14 వారాల వయసులో 3 డోసులు వేయించాలని సూచించారు. దీని ద్వారా కోరింత దగ్గు, డిప్తీరియా, ధనుర్వాతం, హిబ్, హెపటైటిస్-బి రాకుండా చేయవచ్చన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేస్తారని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ షాహిస్తా ఫాతిమా, డీపీఓ విజయరాజు, ఆరోగ్య బోధకురాలు పద్మావతి, జయకుమారి, ఆరోగ్య కార్యకర్త భూలక్ష్మి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

బాణాసంచాతో జాగ్రత్త

కర్నూలు (టౌన్): బాణాసంచా విక్రయించే షాపుల వద్ద అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. అలాగే జిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బాణాసంచా కాల్చేటప్పుడు పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు. దీపావళి పండుగ చీకట్లను పారద్రోలి ప్రజల జీవితాల్లో కాంతులు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలకు, రోడ్ల వెంబడి వెళ్లే వాహనాదారులకు ఇబ్బందులు కలిగించరాదని సూచించారు. లైసెన్సు లేకుండా ఎవరైనా బాణాసంచా నిల్వ చేసినా, అమ్మినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): ఏపీఎస్ఆర్‌టీసీ ఉద్యోగులకు బుధవారం స్థానిక ఆర్టీసీ శిక్షణా కళాశాలలో టెక్నికల్ ఆడిట్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఇందులో కర్నూలు, నంద్యాల డిపోల మేనేజర్లు, మెకానిక్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ఆర్టీసీ కేంద్ర కార్యాలయ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (ఆపరేషన్స్) విజయరత్నం హాజరయ్యారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ప్రజారవాణా అధికారి రజియా సుల్తానా, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ హరినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ ఎస్ఐకు సత్కారం



పదవీ విరమణ పొందిన ఏఆర్ ఎస్ఐ జి.వి. సుబ్బారెడ్డిని సన్మానించిన ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు (టౌన్): సుదీర్ఘకాలం పోలీసు శాఖలో విశేషంగా సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆర్మ్ రిజర్వుడ్ హెడ్ క్వార్టర్స్‌లో పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఏఆర్ ఎస్ఐ జి.వి. సుబ్బారెడ్డిని ఎస్పీ శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ క్రిష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, ఆర్ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా, నా క్లయింట్స్ అగు 1) శ్రీ.పి.వెంకటరమణ, వయస్సు: 65 సం.లు, తండ్రి: పోలిశెట్టి విశ్వనాథం, కర్నూలు సిటీ, 2) శ్రీమతి.పి. సువర్ణమ్మ, వయస్సు: 67 సం.లు, భర్త: పోలిశెట్టి బ్రహ్మయ్య, కర్నూలు సిటీ అనువారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ప్లాట్లను రిజిష్టరు డాక్యుమెంటు నెం. 2959/1999, తేది: 24-05-1999 ద్వారా కొనుగోలు చేసినారు. మరియు డాక్యుమెంటు నెం. 1672/1999, తేది: 27-03-1999 ద్వారా కొనుగోలు చేసినారు. ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిపై నా క్లయింట్స్‌కు తప్ప ఎవ్వరికి ఎలాంటి హక్కు అధికారములు లేవు. కాని కొందరు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిపై వారికి హక్కు ఉన్నదని అమ్మడానికి ప్రయత్నం చేయుచున్నారని తెలియవచ్చినది. కావున యావన్మందికి తెలియజేయడం ఏమనగా, నా క్లయింట్స్‌కు తప్ప ఇతరుల నుండి ఎలాంటి క్రయవిక్రయములు జరిపినా అట్టివారిపై మా క్లయింట్స్ చట్ట ప్రకారము సివిల్ & క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని యావన్మందికి తెలియజేయడమైనది.

1) శ్రీ.పి.వెంకటరమణకు చెందిన స్థిరాస్తి వివరములు:
కర్నూలు డి., కర్నూలు సబ్ డి., కర్నూలు మున్సిపల్ కార్పోరేషన్ 40వ వార్డు నందలి విద్యా నగర్ నందు రెసిడెన్షియల్ ఏరియా 40/380, 40/381 డోరు నెంబర్ల తాలూకు బయలు స్థలము అనగా కర్నూలు గ్రామ పొలము సర్వే నెంబరు: 172/1 నందు తూ-ప: 61 అ.లు, ఉ-ద: 40 అ.లు, విస్తీర్ణం: 2440 చ.అ.లు లేక 271.11 చ.గ.లు గల ప్లాటు ఇందుకు చెక్కుబంది. **తూర్పు**: అబ్దుల్ రహిమాన్ రూములు, **పడమర**: విద్యానగర్ రోడ్డు, **ఉత్తరం**: పి. సువర్ణమ్మ గారి తాలూకు బయలు స్థలము, **దక్షిణం**: కె.యస్. సలీంబాష తాలూకు బయలు స్థలము ఈ హద్దులకు లోనైన ప్లాటు స్థలము.

2) శ్రీమతి.పి. సువర్ణమ్మకు చెందిన స్థిరాస్తి వివరములు:
కర్నూలు డి., కర్నూలు సబ్ డి., కర్నూలు మున్సిపల్ కార్పోరేషన్ 40వ వార్డు నందలి విద్యా నగర్ నందు రెసిడెన్షియల్ ఏరియా 40/380, 40/381 డోరు నెంబర్ల తాలూకు బయలు స్థలము అనగా కర్నూలు గ్రామ పొలము సర్వే నెంబరు: 172/1 నందు తూ-ప: 61 అ.లు, ఉ-ద: 40 అ.లు, విస్తీర్ణం: 2440 చ.అ.లు లేక 271.11 చ.గ.లు గల ప్లాటు ఇందుకు చెక్కుబంది. **తూర్పు**: అబ్దుల్ రహిమాన్ రూములు, **పడమర**: విద్యానగర్ రోడ్డు, **ఉత్తరం**: ఆషాబీగారి 40/379-సి, **దక్షిణం**: కె.యస్.సలీంబాష తాలూకు బయలు స్థలము.

ఎం.సంజీవరెడ్డి, అడ్వకేట్,
43-262-1ఎం, ఎస్.ఆర్.పేట, కర్నూలు. సెల్ 9440292365